



# పోరుతల్లి

బెజ్జారపు రవీందర్

కొవిరయ్య సారు పాటం చెప్తా వుంటే అది సగం అర్థమైతది, సగం అర్థంకాదు. బట్టల పాటం చెప్తున్నడు. అప్పటి జమానాల బట్టలను రాట్నాల మీద, మగ్గాల మీద నేసెటోళ్లని అన్నడు.

నేనైతే గవ్విటిని ఎప్పుడు సూడలేదుగాని, నా ముంగట కూసున్న సాలోల్ల పసాదానికి కొద్దిగ తెలిసినట్టుంది. ఆడు సంబరంగా, "ఔను సార్, గవ్వి మా ఇంట్ల అటుకు మీదున్నయి. గప్పుడెప్పుడో మా తాత టిక్కు టిక్కుమనుకుంట మగ్గం నడిపెటోడంట!" అన్నడు.

కాలానికొక్క తీరుగ బట్టలు తొడుక్కోవాలని సారు జెప్పిండు. ఎండాకాలంల సైను బట్టలు, వానకాలంల రేన్‌కోట్లు, టెర్లిన్ బట్టలు... సలికాలంల సూటర్లు, కొంచెం మందపు బట్టలు తొడుక్కోవాల్నంట! సార్ నన్ను ఎక్కిరిత్తున్నడేమోనని అనుకున్న! నా అంగీలాగు ఏ బట్టనో తెలువది. అది ఏ బట్ట అయితేందిగాని నాకున్నయి మొత్తంల రొండు అంగీలు, రెండు లాగులు. ఏ కాలంల అయినా గవ్వే ఏసుకుంట. అవ్విటికి గూడా ఎటుజూసినా పొక్కలే. మా సోపతోల్లందరు టప్పాకానాలు, పోస్టాఫీసు అని పిలుస్తరు.

కొవిరయ్య సారు మొన్న జెప్పిన పాటం మా నారిగాని పానం మీదికి తెచ్చింది. ఆ దినం సారు సమతుల ఆహారం అనే పాటం చెప్పిండు. పానం మంచిగుండాలంటే అన్నిరకాల తిండ్లు తినాల్నని చెప్పిండు. ఓ దినం కూరగాయలు, ఓ దినం ఆకుకూరలు, పాలు, పెరుగు, నెయ్యి, వెన్న... ఇంకా తినేటోళ్లయితే సియ్యకూర, జిమ్మలు, గుడ్లు తినాల్నని, ఒకటే రకం తింటే పానం మంచిగుండదని చెప్పిండు. వయిల బొమ్మలు సూత్తె నోట్లె నీళ్లూరినయి.

నారిగాని గుడిసె మా గుడిసె పక్కపొంటె. ఆడూ నేనూ కలిసి ఇంటికి పోతున్నం. దినాం నాతో గూసులాడుకుంట అచ్చెటోడు, ఏందోగాని గా దినం నాతో ఒక్కమాట మాట్లాడలేదు. కొద్దిగ్గూడ నూకెయ్యలేదు. నా గోళీలు ఇగ్గుకోలేదు. ఏదో మనాది పట్టినోనిలెక్క మెల్లగ నడుసుకుంట అచ్చిండు. సీదా ఆళ్ల అవ్వ దగ్గరికి పోయి, పోంగనే అన్నడు.

"అవ్వా, అవ్వా మనందరి పానం మంచిగుండాలంటే కూరగాయలు, ఆకుకూరలు, సియ్య కూర పెట్టే. దినాం తొక్కువెట్టి నన్ను సంపుతవేందే?!" అన్నడు.

వాళ్లవ్వకు ఏదీ సమఝుకాలె. నేను పోయి సారు చెప్పిన పాటం మొత్తం చెప్పిన.

"అత్తా... అత్తా... ఊకె తొక్కు తింటె పెయ్యి పెరుగదని, ధమాక్ పెరుగదని పాటమయినంక నారిగాడు అన్నాడు..." అని చెప్పిన.

నర్సవ్వత్త పుర్రసెయి లేపి నారిగాని ఈపుల ఒక్క గుద్దు గుద్దింది.

"నీ మొల్దారం దెగ. ఏం బుట్టిందిరా నీకు. నా సిన్నతనంల అంబలి తాగి బతికినం. గిప్పుడు గట్కకూడు తింటున్నం. అప్పుడప్పుడు వరన్నం తింటున్నం. సాలదిరా. నీకు దాంట్లకు కూరగాయలు, సియ్యగూరలు, పాలు పెరుగు కావాల్నారా?" అని తిట్టుకుంట నారిగాని ఎంబడి పడ్డది.

అత్త సేతికి ఆడేనా దొరికేది. గోజలెంబడి ఉరికి అవ్విటిని దాటేసెటోనికి అత్తొక లెక్కనా? కోకో పోటీల గదా అక్కడిదక్కడనే తప్పించుకున్నట్టు అత్తను

తప్పిచ్చుకున్నడు. పాపం మా నర్సవ్వత్త మొసపోసు కుంటా... అన్ని తిట్టుకుంట గుడిసెలకు పోయింది.

ఇదంతా సూత్తున్న మా లచ్చవ్వ నన్ను మా గుడిసెలకు తీసుకపోతా వుంటే నర్సవ్వత్తకు మళ్లా ఏం యాదికి వచ్చిందోగాని ఇవుతలకి వచ్చి, "గీ లచ్చవ్వ మనుమని సాలన్నా రాకపాయె నీకు. అవ్వా అయ్యా జరిగిపోయినా ఆళ్ల బాపాయి తాన ఎంత బుద్ధిగుం టడు. ఆ లచ్చవ్వ ఏం తింటదో... ఆ పిలగానికేం పెడుతదో... ఒక్కనాడన్న నోట్లెమాట బయటకచ్చి నాదిరా? నువ్వేందిరా, కడుపా కయ్యనా దొరగారి దొయ్యనా అన్నట్టు తింటనే ఉంటవ్. మల్ల గిది వెట్టలే గది వెట్టలే అంటవ్. బేమాని పోరనివిరా..." అని తిట్టుడు మొదలువెట్టింది.

బడి నుంచి ఇంటికి రాంగనే మా లచ్చవ్వ బువ్వ పెడుతది. ఇయ్యాల రాచ్చిప్పల మంచిగ కారం, చింత కాయ, ఎల్లిపాయలేసి నూరిన తొక్కున్నది. కాని గీ లొల్లికి లచ్చవ్వకు ఏమనిపిచ్చిందోగాని కోమట్ల దుకా ణానికి పోయి ఒక గుడ్డు తెచ్చి అట్టు వోసింది. నారిగాని కింత నాతోటి పంపిచ్చింది.

*

ఇయ్యాలగూడా నారిగాడు గీ బట్టల పాఠం గురించి ఇంటికి పోయినంక ఏదో కోతిపని చేస్తడని, మల్ల అత్తతోటి దెబ్బలు తింటడని అనిపిచ్చింది.

కొవిరయ్య సారు, "పాఠం అర్థమైనదిరా?" అని అడిగిండు.

పిలగాండ్లమందరం తలకాయలు ఊపినం. గంట కొట్టినంక సారు పోయిండు. గింతట్లనే శంకరయ్య సారు మా క్లాసు ముంగటికేలి నాలుగో తరగతిలకు పోతుండు.

తలుపు దగ్గరున్న ఆడపిలగాండ్లందరు గావు రంగా, "సారు, మాకు రాన్రి," అన్నరు.

ఆ సారంటే మాకు బగ్గ కాయిషి!

*

ఒక్కొక్కసారి మా నారిగాన్ని సూత్తే పాపమని పిస్తది! దినాం పొద్దుగాల్ల లేసేటప్పుడు నర్సవ్వత్త తోటి తిట్లు తినుకుంట లేస్తడు. బడి ఉన్న రోజుల్లల్ల పొద్దెక్క దాక పంటడు. తిట్టి, తిట్టి నర్సవ్వత్త ఆని నెత్తిమీద ఒక టొంగనన్న పొడిసేదాక లేసేటోడు కాదు.

ఇయ్యాల మసుకుల్నే లేసిండు. అయినాగూడా తిట్లు తింటుండు. ఎందుకంటే ఇయ్యాల ఐతారం బడి ఉండది!

"నీ తలపండు వలుగ. ఐతారం గోలె నడిరాత్రి లేసి మిడి గుడ్లేసుకొని పెద్దపిట్టలెక్క కూసున్నవేందిరా?! బడి ఉన్న రోజుల్లల్ల గిట్లెందుకు తెలివిగాదురా నీకు..." నర్సవ్వత్త నోరు బల్లె గంటలెక్క టన్‌టన్‌మని ఇనిపిత్తది.

మా లచ్చవ్వ దిక్కు చూసిన. ఆకిలి ఊడుత్తంది. ఎందుకోగాని లచ్చవ్వ నన్ను గింతగానం తిట్టది. అయ్యా, అవ్వలేని పోరన్నని గావచ్చు.

మా నర్సవ్వత్త అప్పుడప్పుడు నన్ను గూడ దులుపుతది.

"ఏందిరా, పెద్ద మొగోనిలెక్క లచ్చవ్వ, లచ్చవ్వ అంటవ్. అవ్వ అనరాదురా. నిన్నని ఏం ఫాయిదాలే. నీ కన్నతల్లే తల్లిని పట్టుకొని అవ్వ అని ఎప్పుడు అనలే. అదిగూడా లచ్చవ్వ మీదికేలి దిగకపోతుండె. తల్లి సాలే అచ్చిందిరా నీకు..." అని తిడుతుంటది.

ఎంతన్నాగాని, నన్ను కన్నోల్ల ముచ్చట తీసినప్పు డల్లా మా నర్సవ్వత్తకు దుక్కమాగేది కాదు. మా అవ్వా, అత్తా... ఇద్దరికీ బాగా సోపతంట! నారిగాడూ, నేనూ ఎట్ల జిగిరి జిగిరి ఉంటమో అట్లా ఉండెటోల్లంట. మంచిగున్న రోజుల్లల్ల మా లచ్చవ్వ మా అవ్వను జూసి నట్టె నర్సవ్వత్తను గూడా సంతబిడ్డ లెక్క చూసుకుం టుండెనంట. ఏ పండుగ జరిగినా మా లచ్చవ్వ, మా అవ్వకు పెట్టినట్టే నర్సవ్వత్తకు కూడా రైకబట్ట పెడు తుండెనంట!

ఐతారమైనా నారిగాడు గంత పొద్దుగాల ఎందుకు లేసిండో ఒక్క నాకే తెలుసు. నేను గూడా పిల్లి లెక్క లేసి మెల్లగ మొకం కడుక్కున్నా. ఇంట్లోల్లకు అనుమానం వస్తదని ఇద్దరం ఎదురుపడ్డా మాట్లాడు కోలె. మా లచ్చవ్వకు అనుమానం రానే వచ్చింది.

"ఏందిరా, ఇద్దరు మల్ల మాటలు బంజేసిన్రా? లేకపోతే ఏదన్న గూడుపుఠాని జేత్తున్నా...?" అని అడుగనే అడిగింది.

పరేషానైన. ఈ ఆడోల్లకు గిన్ని సంగతులు ఎట్ల తెలుస్తయో?! మనసులున్నది గిట్లనే పసిగడ్తరు.

సప్పుడు జెయ్యకుండ ఇద్దరం బయటవడ్డం. అచ్చేటప్పుడు ఇంటెనకున్న ఖాళీ జర్దా డబ్బా, సలాక తీసుకచ్చినం. సంది దాటంగనే ఆగకుంట ఉరికినం. ఉరికి, ఉరికి చింతకాడికి అచ్చినం. అప్పటికే అక్కడ మా సోపతోల్లు ఉన్నరు. గౌండ్లోల్ల ధరంపురి శేఖరు, మంగలోల్ల నర్సిగాడు, గొల్ల మల్లిగాడు, పంబాలోల్ల సత్తిగాడు, సాలోల్ల పసాదడు, గంగాధరి ఉన్నరు. మమ్ముల్ని చూడంగనే ముసిముసిగ నవ్వుకుంట,

"ఏందిరా, బావా బామ్మర్దులిద్దరు ఆల్శంగ అచ్చిన్రు," అన్నరు.

"మా అవ్వకు తెలుస్తే రానియ్యదిరా. ఇయ్యాల మిరపసేన్లకు కైకిలికి తోలుకపోతుండె..." అన్నడు నారిగాడు.

ఎందుకోగాని మా లచ్చవ్వతోటి కైకిలికిపోతే మంచిగుండు అని పానం కొట్టుకున్నది. మల్లొకపక్క జిమ్మలకు వోక బాగా రోజులైతుంది. ఈ ఒక్కసారికి ఈల్లతోటి జిమ్మలు పట్టటానికి పోదామనిపిచ్చింది.

నేను అటూ ఇటూ సోంచాయించుకుంట వుండంగనే నారిగాడు సలాకతోటి అక్కడక్కడ దవ్వి ఎఱ్ఱలు పట్టి డబ్బాలేసిండు. అందరం కల్సి గాలాలు సరిజేసుకున్నం. ఎక్కడికి పోవల్ననేకాడ లొల్లి మొదల యింది. ఒకడు లకుమాదేవి సెర్లకు పోదామంటడు. ఇంకోడు జల్మయిసెర్లకు, ఇంకోడు మాదిక్కుంటకు పోదామంటడు. ఇదంతా జూసి మన రాయికంటి ఊరికి గిన్ని సెర్లుందుకున్నయిరా అని పసాదడు గులి గిండు. లాస్టుకు జల్మయి సెరువుకు పోయినం.

సెరువు తూము దాటిపోయి కొద్దిగ సాటు ఉన్న కాడ కూసున్నం. వంతులకొద్ది అటెవలన్నా బెస్తోల్లు అస్తున్రా అని చూసుకుంట ఉన్నం. మా అదృష్టం మంచిగుండి ఎవరూ రాలే. రొండు గంటల్లల్ల అందరికి మంచిగనే జిమ్మలు దొరికినయ్. మస్తుసేపు సెర్ల ఈతలు గొట్టినం. అచ్చేటప్పుడు మల్లొకసారి నీల్లల్ల గాలాలు ఏసి కూసున్నం గాలానికేదో పెద్ద జిమ్మనే తలిగినట్లుంది. బగ్గ గుంజుతంది. బిగ్గీతవట్టి గుంజిన. అది పాపెర! పాములెక్కనే ఉంటది. మా లచ్చవ్వకు అన్ని జిమ్మల్లల్ల పాపెర్లంటెనే బాగా కాయిషి. నాకైతే జెల్లలు. పాపెరను ఇగ చేతుల్లల్లకు తీసుకుంటున్నా... అది తడితడిగా నున్నగా చేతికి తగులుతనే ఉన్నది. గంతట్లనే "వావ్వో" అని ఒఱ్ఱిన. అది సాపెరగాదు, పాము! నీరుగట్టె!

గాలాన్ని గట్లనే నీల్లల్ల పారేసి ఉరికిన. ఎట్ల ఉరికిన్నో తెలువలే. ఉరికి, ఉరికి ఇంట్ల వడ్డ.

ఎందుకోగాని పెయ్యంత పుండు పుండయి నట్లనిపిస్తంది. బగ్గ సలి పెడుతుందనిపిచ్చింది. మంచం మీద పండుకొని గొంగడి గట్టిగ కప్పుకున్న. అయినా సలి ఆగలే. పెయ్యిలకేలి సలివోలె. బుగులువోలె. ఎప్పుడు వానకోయిలల్తోటి, సెట్టురిక పాముల్తోటి ఆడు కునెటోన్ని, నీరుగట్టె జూసి ఎందుకు దడుసుకున్ననో అర్థంకాలె.

ఎప్పుడు నిద్రపట్టిందో తెల్వది. లచ్చవ్వ లేపు తుంటె సోయచ్చింది. కండ్లన్నీ మండుతున్నయి. తలెల శాపలకూరతోటి బువ్వ వెట్టింది. తినబుద్ధిగాలె. లచ్చవ్వచ్చి నా నొసలు ముట్టి జూసింది.

"అయ్యో, పోరని పెయ్యి పెనం లెక్క కాల్తంది. ఎటు తిరగద్దంటే ఇనవేందిరా. ఐతార మచ్చిందంటె సాలు సెర్లపొంటి సెలుకలపొంటి తిరుగతవేందిరా. ఒక్కపూటకే ఎట్లయినవుర ఎలుకపిల్ల లెక్క," అను కుంట కండ్లల్ల నీళ్లు వెట్టుకుంది.

వారంరోజులాయె. పెయిలకేలి జరం దిగలే. మా లచ్చవ్వ డాక్టరుకు చూపిచ్చింది. అయినా తక్కువ గాకపోతే దావతోనితోటి దించిపిచ్చింది. ఎముడాల రాజన్నకు మొక్కుకుంది.

మందుల దెబ్బనో, దించిపిచ్చుడు వైమనో, ఎముడాల రాజన్నమొక్కోగాని... జరం కొద్దికొద్దిగ దిగవట్టింది. బడికి పోవాల్నని పానం కొట్టుకోవట్టె. లచ్చవ్వతోని చెప్పిన. గట్లనే అంది. గిన్ని రోజులు బడికి వోకపోతే సార్లు కోపాని కత్తరు. అవ్వను గూడ ఎంబడి తోలుకపోయిన.

మా క్లాసురూముల కూసున్నంక, కొద్దిసేపైనంక మల్ల జరమచ్చినట్లు అనిపియ్యవట్టె. గంతట్లనే శంకరయ్య సారచ్చిండు. ఎంబడి పెద్ద కమ్మ మడిచి పెట్టుకొని తీసుకచ్చిండు. అండ్ల బొమ్మ దించి ఉంట దని మా అందరికి ఎరుకే.

మా సారుకు మంచిగ బొమ్మలు దించత్తది. రూమునిండా బొమ్మలు దించి తలిగేసింది ఆ సారే. సారు బోర్డు మీద బొమ్మలు దించుతుంటే... అదీ ఇంక భారద్దేశం పటమేత్తుంటే ఆకిట్ల మా లచ్చవ్వ ముగ్గేసి నట్లే అనిపిస్తది.

"ఈ దినం మనం సాసంత్రం కోసం కొట్లాడినామె గురించి కథ చెప్పుకుందాం," అన్నడు శంకరయ్య సారు.

"ఆమె పేరే జాన్సీ లచ్చింబాయి!" అన్నడు గట్టిగ.

సారెప్పుడు గింతె. పాఠం పేరును సిన్మాపేరు చెప్పినట్లు చెప్పుతడు. మాక్కూడా గట్లనే మంచిగని పిస్తది. పాఠం గూడా సిన్మా కథ లెక్క చెప్పుతడు.

సారు కమ్మ ఇప్పుడు మొదలువెట్టిండు. బల్ల మీద నిలబడి గోడకు అంటేసిండు.

బొమ్మ చూడంగనే నా పానం ఎల్లుకపోయింది. పెద్ద బొమ్మ. కండ్ల నిండారుగ ఉంది. తెల్లటి గుఱ్ఱమ్మీద ఎఱ్ఱటి సీరతోటి జాన్సీ లచ్చింబాయి! కల్లెమొక సేతిల, కత్తి ఒక సేతిల పట్టుకుని ఉంది.

అదిగాదుగని గా తల్లి ఈపుల పిలగాన్ని కట్టు కున్నది. అది సూడంగనే నా కండ్లల్లకు నీల్లచ్చినయి. పిలగాన్ని పట్టుకొని రనం జేత్తన్నది!

సారు గామె కథ జెప్పుడు మొదలువెట్టిండు. అయ్యో! అయ్యో!! ఏం జెప్పాలె నా సంగతి! గామె కథ నా నెత్తురుల ఇంకిపోతా వున్నది. సారు ఎవల కథ జెపు తాండు? నిజంగా జాన్సీ లచ్చింబాయి కథేనా? కాదు, కాదు... మా లచ్చవ్వ కథ! లచ్చవ్వా, లచ్చవ్వా... ఎక్క డున్నవే?! ఏం జేత్తన్నవే?! నీ బొమ్మ... నీ కథ!!

జాన్సీ లచ్చింబాయి రాజ్యంకోసం గూసులా డింది. సొసంత్రం కోసం కొట్లాడింది. మా లచ్చవ్వ ఎకురం పొలంకోసం పోరు జేత్తన్నది. గా తల్లికి పిల గాండ్లు లేకపోతే ఒక పిలగాన్ని సాదుకున్నదట. మా లచ్చవ్వగూడా నన్ను సాదుకుంటున్నది. లొల్లి... లొల్లి... కొట్లాటల్నే సచ్చి పోయిందంట జాన్సీ లచ్చింబాయి.

మొన్న జరంతోటి మంచంమీద పన్నప్పుడు పట్వారి పంపిన సుంకరోల్లు ఇంటిమీది కచ్చిన్రు. మా ఎకురం భూవికి తాశీల్ కట్టుమని లొల్లిపెట్టిన్రు. ఆళ్ల తోటి మా లచ్చవ్వ ఏమన్నది-

''పట్వారికి చెప్పున్రి బాంచెన్. పాలిచ్చే బర్రెను కొనుక్కున్నా ఆ పాలమ్మి బర్రెకైన అప్పు తీర్పచ్చు. వున్న ఎకురం గోపాల్‌రావు దొర దగ్గర కుదువవెట్టిన. రొండేండ్లాయె. అండ్లకు నన్ను రానిత్తలేడు. ఎవుసాయం చెయ్యనిత్తలేడు. దాని మీదచ్చే పంటతోటన్నా... మేం తిన్నా తినకపోయినా సర్కారుకైతే కట్టెటోల్లం. దాంట్ల గింజ నా నోట్లకత్తలేదు. సర్కారుకు పోతలేదు...'' అన్నది ఏడ్సుకుంట.

మా లచ్చవ్వ ఏడుపు జూసి సుంకరి పోశాలుకు గోసనిపిచ్చినట్లుంది.

''అదిగాదె సిన్నాయి. నువ్వంటే నాకేమన్నా దుష్మనా, పట్వారీ పంపిండు. నేనచ్చిన. అయినగాని, ఓ మాట జెప్తా సిన్నాయి, ఏమనుకోకే. నువ్వొత్త పిస దానివే! లేకపోతే పోయి పోయి దొర సంకల్నే జాత్తవానే. ఆ దొర అటు పదెకరాలకు ఇటు పదెకరాలకు నడిమిట్ల నీ భూమి ఉన్నది. గది గూడా కలుపుకుంటే మొత్తం ఒక చెక్క అయితదని దొరకు. నువ్వేమో అమ్మకపోతివి. నీ తల్లిగారోల్లు ఇచ్చినదాన్ని గట్లనే ఉంచుకుంటా నంటివి. పానమన్నా ఇడిసి పెడతగని భూమి ఇడిసి పెట్టనంటివి. గొర్రెకదా కటికోని దగ్గరికి పోయినట్లే మల్ల నువ్వు సీదా అక్కడికే వోతివి. ఎవ్వలేం జేత్తరు? నీ గాశారం గట్లుంది,'' అన్నడు.

మల్ల అన్నడు, ''ఎవల్తోటి జెప్పకుగాని గోపాలు రావు దొర పట్వారీని పిలిపిచ్చుకొని నీ సంగతి జూడ మని చెప్పిండు. దొరోని ఇకమతులు ఎవని కత్తయిలే?...'' అన్నడు.

సారు జాన్సీ లచ్చింబాయి చేసిన పోరు సంగతి చెప్తున్నడు. నాకేమో మా లచ్చవ్వే యాది కత్తున్నది. ఎకురం పొలం కోసం మా లచ్చవ్వ బతుకంతా చేసిన, సేత్తున్న కొట్లాట యాది కత్తున్నది.

గప్పుడెప్పుడో నేను పుట్టకమునుపు మా తాత నల్లగల్లు దుకాన్ల తాక్కుంట తాక్కుంట ఉద్దెర పెట్టి... పెట్టీ అయిన పైసలకిందికి పొలాన్ని నల్లగల్లు దుకాణ పాయన కాడ కుదవ పెట్టిండు. అది మా తాత సచ్చి పోయినంక మా లచ్చవ్వకు తెలిస్తే నెత్తీనోరు గొట్టుకొని ఏడ్సింది. కులపోల్ల కాళ్లు, ఆళ్ల కాళ్లు, ఈళ్ల కాళ్లు పట్టుకొని పనిగాకపోతే దొరకాడకి పోయింది. దొర నల్ల గల్లు దుకాణపోన్ని పిలిపిచ్చి మస్తుగ తిట్టంగనే మా లచ్చవ్వకు పానం లేసచ్చినట్టు అనిపిచ్చిందంట. దొర ఆనికి కొన్ని పైసలిచ్చి మల్ల మా పొలం జోలికి రావద్దన్న డట. పన్లెపని మా లచ్చవ్వతోటి తెల్లకమ్మల మీద అంగుటి నిశాన ఏపిచ్చుకున్నడట. గట్ల మా పొలం మా తాత కాడి నుంచి కల్లు దుకాణపాయన కాడి నుంచి దొర తానకచ్చింది.

కడుపు మాడవెట్టుకొని, ఎండనక, వాననక, సుస్తనక కైకిలుజేసి జేసి ఒక్కొక్క పైస జమ జేత్తుండె. తాపకుగొన్ని పైసలిచ్చుకుంట అచ్చినాగాని దొరమల్ల కొత్త లెక్కలు చెప్తుతనే ఉన్నడంట.

''దొరకాడ మన అప్పుకు మిత్తి, మిత్తి మీద మిత్తి ఊటబాయి లెక్క ఊరుతనే ఉన్నదిరా. ఆనికి కనికర మెప్పుడు కలుగతదో మన పొలం మనకెప్పుడు ఇడిసి పెడుతడో...'' అని అనుకుంట పొలం కోసం మా లచ్చవ్వ ఆగమాగమయితుంటది.

మా తాత సచ్చిపోయిండు. మా అవ్వపోయింది. అయ్య పోయిండు. ఎకురం పొలం గట్లనే దొర గిరిలనే ఉన్నది. మా లచ్చవ్వ ఇంకా కొట్లాడుతనే ఉన్నది.

గట్లనే మా లచ్చవ్వ కైకిలు చేసుకుంటా నన్ను సాదుకుంట ఉన్నది. తాను తిన్నా తినకపోయినా నా కడుపుల గింతంత గంజన్నా, అంబలన్నా పడేటట్లు సూత్తుండె.

మొదట్ల బగోన్లె ఉన్న అంబలంత నేనే తాగు తుంటి. నేను తాగి పడేసిన బగోన్లె మా లచ్చవ్వ నీళ్లు పోసుకొని ఏలితోటి గీకిగీకి తాగుడు సూసినంక... తినే దాన్నల్ల మా లచ్చవ్వకు మిగుల్చుడు అలవాటు చేసుకున్న.

ఆరోజు బాగా యాదికి. మా బక్క ముసల్దానికి గంత ధైర్నమెట్లచ్చిందో... అదే మొదటిసారి ఇక ఎప్పుడు దొరకు భయపడలే.

రొండేండ్ల కిందటి ముచ్చట. గా దినం దొర మా గుడిసె ముంగట నిల్సున్నడు. మా లచ్చవ్వ పబ్బతి పట్టుకొని నిలవడ్డది.

''లచ్చీ... నేనిచ్చిన పైసలు వాపసుజేసుడు నీతోటి కాదుగని, నీ ఇల్లు జరిగే ముచ్చటొకటి చెప్త ఇను. మా బర్లగాసే పొలగాడు పనికి సాల్తలేడు. నీ పిలగాన్ని గూడా గడికి పంపు. పొట్టకు బట్టకు లోటు లేకుండా చూస్త. సంవత్సరానికింతని ఇస్త. నీక్కూడా ఎల్లుబాటయితది'' అన్నడు.

మా లచ్చవ్వ కొద్దిసేపటిదాకా ఏం మాట్లాడలే. గట్లనే బొమ్మలెక్క నిలవడ్డది. కండ్లు సిన్నగైనై. పెయ్యంత ఒక్క తీరుగ అనుకవట్టె.

"నువ్వు నా పిలగాన్ని పాలేరును చెయ్యాలనుకుంటున్నవా దొర?!" అని అడిగింది.

గంతే అన్నది. కాని ఆ అడుగుడు తరీఖనే వేరే తీరుగ ఉన్నది. సెవులు లేనోడయితే గా మొకం జూసి శాపనార్థాలు పెడుతున్నది అనుకోవాలె.

"ఏందే ముసల్దానా, బాగా పోకటచ్చిందేమే నీకు," అన్నడు దొర కోపంతోటి.

"ముసల్దాన్నే దొర. కాటికి కాల్లు జాపుకున్నదాన్ని. నాతాన ఏం ఉంది? పొలం ఉండె. గిరి వెట్టుకున్నవు. పొరగాడున్నాడు. నా పానం ఉన్నది. పోరన్ని నీకు అరమియ్యాల్నా? ఇయ్య. ఇగ నా పానంతీస్కో. నా ఉసురు వోసుకున్న నీ గడి సత్తె నాశనమయితది," అని శాపనార్థాలు వెట్టింది.

దొర కోపం జూడాలే. పోశమ్మ కాడ గొర్రెపిల్లను గావు పట్టేటోని మొకం లెక్క దొర మొకం! మా లచ్చవ్వను ఈడ్సి తన్నిండు. అక్కడవోయి పడ్డది. పడ్డది పడ్డట్టే ఉన్నది. అక్కడ్నుంచే దొరను మిర్రిమిర్రి సూడ వట్టె. వోటు మాటలు తిట్టుకుంట దొర ఎల్లిపోయిండు. ఆడటు పొంగనే మా లచ్చవ్వ సడకు మీదికి మన్ను ఎగవోసుకుంట తిట్టినతిట్టు తిట్టకుండ తిట్టింది.

మా నర్సవ్వత్త గజగజ అనుకుతా ఉన్నది. మా లచ్చవ్వను ఊకుంచుటానికి మస్తు కోశిష్ చేసింది.

"ఊకోయే... ఊకో! ఆల్లు దొరలు. ఆల్లతోటానే నీకు కొట్లాట. ఆల్లు కండ్లెర్రజేత్తే నువ్వెక్క డుంటవే. పోరని మొకం జూసైనా నువ్వు శాంతంగా ఉండాలె..." అని ఊకోవెట్టింది.

ఇది జరిగినంక కొన్ని దినాలకే మా లచ్చవ్వ కైకిలుకువోయి అత్తుంటే ఎవలో రాల్లతోటి కొట్టిన్రు. తల వగిలింది. పాయిందేశాలు ఇంట్లనే పన్నది. గోజ అసోంటి మనిషిని కొట్టుటానికి ఆల్లకు సేతులెట్లచ్చినయో! అన్ని దినాలు బడి ఎగ్గొట్టి అవ్వతోనే ఉన్న.

లచ్చవ్వ పట్నంబోయి తాసీల్దారుని గలిసింది. అమీన్‌సాబును గలిసింది. అందరు మిడుసుల్లపట్టి నూకేసిన్రు. ఒక్కల్లు దగ్గరకు తియ్యలే.

మా ఊర్లె దొరకు ఖిలాఫ్ జేసి ఆఫీసర్లని కలిసిన మొదటి మనిషి మా లచ్చవ్వనేనంట. దాని ధీముకు అందరు పరేషానైన్రు. గప్పటి నుండి మమ్ముల్ని పొలం తొక్కనియ్యలె దొర.

ఇంకొన్నొద్దులకు ఓ రాత్రి మా గుడిసె కాలింది. ఎట్లున్నోల్లం గట్లనే బయటవడ్డం. గుడిసె, సామాన్లు అన్ని కాలినయి.

దొర పాలేరు ఈరిగాడచ్చి, "మీ గుడిసె కాలిందని దొర బాధపడుతున్నడే లచ్చి. మిమ్ముల్నిద్దర్ని గడిల ఉండుటానికి రమ్మంటున్నడే..." అని ఇంక ఏదో చెప్పబోతా ఉంటే అని కాల్ల దగ్గర తుపుక్కున ఊంచింది మా లచ్చవ్వ.

ఇంకో మాట మాట్లాడకుంట ఆడెల్లిపోయిండు.

జాన్సీ లచ్చింబాయి... మా లచ్చవ్వ... ఇద్దరి సంగతులు... కొట్లాటలు నా తలకాయల కలిసిపోయినయ్. ఏది జాన్సీ లచ్చింబాయి ముచ్చటనో ఏది మా లచ్చవ్వ కొట్లాటనో తెలవకుంట అయింది. బగ్గ సోంచాయిస్తే జాన్సీ లచ్చింబాయి అవతారమే మా లచ్చవ్వనిపిచ్చింది.

లచ్చవ్వా! లచ్చవ్వా! ఎకురం పొలం కోసం దిన మొక రనం జేత్తున్నవు గదనే.

ఒక సేతిల కురిపె, సంకల నేను ఉన్న మా లచ్చవ్వ యాది మనసులకెలి పోతలేదు. కండ్లకు నీల్లచ్చినయి. మా లచ్చవ్వ ఆశలు రొండే రెండు. మా పొలాన్ని ఇడియ్యాల. నన్ను మంచిగ సదివిపియ్యాలె! గివ్విటికోసమే దినాం సచ్చి బతుకుతుంటది. మొగోని కన్న, అయిసిదానికన్న ఎక్కువ పనిజేత్తది.

నారిగాడు నా పెయ్యి ముట్టి జూసిండు.

"సార్... ఈని పెయ్యి బగ్గ కాల్తుంది సార్. బగ్గ జరమచ్చింది," అన్నడు.

సార్ నన్ను ఇంటికి పంపిచ్చిండు. ఇంటికి పోయి నగని ఏం లాభం? ఎవ్వలుండరు! అవ్వ నర్సవ్వత్త కైకిలికి పోయిన్రు. సోపతోల్లు కొంతమంది బడికి మిగిలినోల్లు బర్లు కాసుటానికో, పనులకో పోయిన్రు. దిగుట్ల పెట్టిన తాళంచేయి తీసుకొని తాళం దీసిన. గట్లనే పన్న. ఎంతసేపు పన్ననో తెలువలే. కండ్లు తెరిస్తే ఎదురంగ మా లచ్చవ్వ. లచ్చవ్వ ఇయ్యాల కొత్తగ కనిపిస్తా వుంది.

నడిరాత్రి తెలివికయింది. గుడిసెల ఏదో సప్పుడైతే లేసి చూసిన. కందిలి ఎలుగుల మా లచ్చవ్వ తట్టు సంచిల ఏదో మూట కట్టుకుంట కనిపిచ్చింది. మంచిగ చూసిన. అది పొత్రవుతు! మక్కలను... ఇంక ఏదన్న పిండ్లను రుబ్బే పొత్రాయిని మా లచ్చవ్వ గింత రాత్రి ఎటు తీసుకపోతది? ఏం పని? సమజ్ కాలె. అయింత దొరను సంపుటానికి పొత్రాయి తీసుకపోతలేదు కదా!

లచ్చవ్వ నన్ను జూసింది. కొత్తగ ఉంది ఆ సూపు. దగ్గరకచ్చి అలుముకుంటా గిట్లన్నది.

"బిడ్డా... నువ్వు జూసె ముచ్చట ఎవ్వలకు జెప్పద్దు... అటుదిటైతే నేను బతికుండుడు అవద్దం!"

ఆ మూట వట్టుకొని ఎటో వోయింది. మస్తు సేపటికి తిరిగచ్చింది. మసుకుల... ఇంకా అంతకంటె ముందే లచ్చవ్వ గుడిసె బయటికచ్చింది. సాతగాకున్నా నేను కూడా బయటకచ్చిన.

ఊరు ఊరంత ఒక్కటయ్యేటట్టు గట్టిగ ఒర్రుడు మొదలువెట్టింది.

“కలచ్చిందే నర్సి... కలచ్చిందే! దేవుడు కలల కనిపిచ్చి బూమి కడుపు తెంపుకొని అత్తానన్నడే...” ఇంక ఏందో ఏందో ఒర్రవట్టె.

మస్తుమంది జమ అయిన్రు. గంతట్లనే దొర పొలానికి కావలుండే లచ్చన్న ఉరికురికి అచ్చిండు.

“పొలంల లింగం మొలిసింది... లింగం మొలిసింది...” అని ఒర్రుకుంట భయంతోటి గడి దిక్కు ఉరికిండు.

అందరు దొరగారి పొలాల దిక్కు ఉరికిన్రు. మేం గూడా ఉరికినం. అక్కడ... మా పొలంల లింగమున్నది! లింగాన్ని జూసినంక అర్థమైంది మా లచ్చవ్వ పనితనం!

నిమిషంలనే కుంకుమ, పసుపు లింగం మీదికి అచ్చిన కొబ్బరికాయలు వలిగినయ్.

మా లచ్చవ్వ తిరం లేకుంట ఉన్నది. అక్కడ్నే... అప్పటిదప్పుడే లింగం సుట్టు సిన్న పందిరేసింది. పుట్టు మన్నుతోటి అలికి ముగ్గులు వెట్టింది. లింగం పొంటే కూసున్నది. గిన్ని దినాలకు మా లచ్చవ్వ మల్ల మా పొలంల నిలవడ్డది. ఎవ్వల సాయం లేకుండ!

ఊరు ఊరంత మా పొలంకాడి కచ్చింది. మా లచ్చవ్వనే తీర్థమిచ్చుడు మొదలువెట్టింది. కాని నాకైతే ఏం మంచిగనిపిస్తలేదు. నాగలివట్టి దున్ననప్పుడు పొలం దేవున్తోటి ఉంటేంది దొరకాడ ఉంటేంది? మా లచ్చవ్వకైతే పొలం మన్ను మీద నిలబడుడే సాలు... సంబురంగ ఉన్నట్టుంది.

మస్తుసేపటికి దొర అచ్చిండు. అనుమానం మొకం ఏసుకొని గట్లనే సూసుకుంట నిలవడ్డడు.

“ఏందే లచ్చీ! ఏదో కొత్త ఏషం గట్టినట్టున్నవ్,” అన్నడు.

మా లచ్చవ్వ దొర కండ్లల్లకు సూటిగ జూసింది.

“దొరా, ఎవ్వల జోలికన్న వో. దేవుని జోలికి రాకు. ఒకసారి నాగుంబామును సంపిచ్చినవ్. వంశం లేకుంట పోయింది నీకు. నీ కోడలు కడుపు పండలే. గిప్పుడు దేవుని జోలికత్తున్నవ్. నువ్వే లేకుంట పోతవ్,” అన్నది ధైర్నంగ.

దొర మొకం మాడిపోయింది. మనాది పట్టుకున్నోని లెక్క పిసపిస అయిండు. పెయ్యంత సెమటలు పట్టినయ్. దొర మీసాల మొకంల మొదటిసారి భయం జూసిన. దొర గూడా భయపడతున్నట్లు!

రాత్రి అక్కన్నే పన్నం. లచ్చవ్వ నాతోని,

“ఆపతి పడుటానికి ఈ లోకంల మనకేం ఉన్నదిరా, పానం తప్ప! పోతేపోనీ బిడ్డా. భయమద్దు. ఐతే మన పొలం అత్తది. లేకపోతే పానం బోతది. గంతే.” అన్నది.

నిజంగ ధీమంటే మా లచ్చవ్వదే!

“నువ్వు లచ్చవ్వవుగాదే, జాన్సీ లచ్చింబాయివే,” అన్న అవ్వను అలుముకుంటా మురిపెంగ.

లచ్చవ్వకు నేనేమన్ననో తెలువలే. అయినా గూడా నా జబ్బును పట్టుకొని సంబురపడుకుంట అటూ ఇటూ ఊపింది.

మసుకుల్నే ఈరిగాడు మా కాడికి ఉరికురికి అచ్చిండు.

“కొద్దిసేపట్ల దొర, దొర్సాని, సినదొర్సాని పూజ చేసుకుంటానికి ఈ తావు కత్తరటనే లచ్చవ్వ. దొర జెప్పిండు. నిన్ను మనసుల ఏం కువారం పెట్టుకోకన్నడే,” అన్నాడు మొస పోసుకుంట.

“దొర మనసు గింత జల్ది మారిందారా?” అని అడిగింది లచ్చవ్వ.

“నిన్న నాత్రి గడీలకు నల్లటి నాగుంబాము అచ్చిందే. మస్తుసేపు మమ్ముల పరేషాన్ జేసింది. సంపుదామంటె దొర అద్దంటడు. కొద్దిసేపట్ల అది వోయింది. ఎట్ల వోయిందో ఎవరికి తెలువలే. మాయమైనట్లే అనిపిచ్చింది,” అన్నడు ఈరిగాడు.

ఆడు వోయినంక మా లచ్చవ్వ నవ్వింది. మస్తుగ నవ్వింది. గంతగనం నవ్వుడు నా జిందగీల సూడలే. నవ్వి నవ్వి సచ్చిపోతదేమోననిపిచ్చింది.

లచ్చవ్వతానికి వోయి అనుమానంతోటి అడిగిన. “అవునే, పొత్రాయిని ఇక్కడ వెట్టినట్టే, నాగుంబామును సుత నువ్వే గడీల ఇడిసిపెట్టినవానే?” అని.

“పిస పోరడ. ఊరన్నంక పాములుండయా? గడీల మస్తు పాములున్నయి. మస్తుసార్లు దొర కండ్లల వడ్డయి. గాని నిన్న గీ దేవుడు... ఎంబడే నాత్రి గడీల నాగుంబాము... గీ రెండు ఒకే తాప జరిగేసరికి దొర గజ్జుమన్నడు. అరే పిలగా, మల్లెప్పుడన్నా దీన్ని పొత్రాయి అనేవు నిజంగా దేవుడురా. మన పొలాన్ని మనకిప్పించి నోడు దేవుడుగాక రాయి అయితాడురా...” అనుకుంట నవ్వుడు మొదలువెట్టింది. నవ్వి నవ్వి, “పాము భయం జెప్పి ఆని కోరలు పీకిన,” అన్నది పెద్ద పోకటతోటి!

***ఆదివారం ఆంధ్రజ్యోతి, 1 జూన్ 2003***

